పేరుకే పశు వైద్యశాల

- వైద్యం అందక మూగ జీవాల రోదన
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పాడి రైతులు

కాళ్ల: పశు వైద్యుల నిర్లక్ష్యంతో తమ పశువులు మృత్యువాత పడుతున్నాయని కాళ్ల గ్రామానికి చెందిన పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యులు సమయ పాలన పాటించకుండా నచ్చినప్పుడు వస్తూ విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మండల కేంద్రంలో ఉన్న పశు వైద్యశాల వద్ద కాళ్ల గ్రామానికి చెందిన గనిశెట్టి మధుబాబు సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతు మధుబాబు మాట్లాడుతూ పేరుకే పశు వైద్యశాల అని ఇక్కడ సరైన వైద్యం అందదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తనకు చెందిన పాడి గేదెకు రొమ్ము వాపు వచ్చిందని డాక్టర్‌కు చూపించానన్నారు. సిబ్బంది వచ్చీ రాని వైద్యంతో తన గేదె రెండు రొమ్ములు పూర్తిగా కుళ్లిపోయి అనారోగ్యానికి గురైందని వాపోయారు. అంతేగాక నెల రోజుల వ్యవధిలో తనకు చెందిన రెండు లేగ దూడలు సైతం మృతి చెందాయని కన్నీటి పర్యంతమయ్యారు. సోమవారం ఉదయం తన ఆవు దూడకు అస్వస్థతగా ఉండడంతో ఆసుపత్రికి వస్తే వైద్యులు అందుబాటులో లేరన్నారు. నిన్నటి వరకు చెంగు చెంగున గంతులేస్తూ తిరిగే ఆవు దూడ మృత్యువాత పడిందని తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యానికి ఇదొక మచ్చుతునకని మండలంలో ఇటువంటి సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయని స్థానిక రైతులు తెలియజేస్తున్నారు. అంతేగాక ప్రభుత్వం అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయని రైతులు వినియోగించుకోవాలని చెబుతున్నా తాము ప్రైవేట్ మందుల దుకాణంలో కొనుక్కోవలసి వస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ వైద్యులు అందుబాటులో లేక ప్రైవేట్ వ్యక్తులకు డబ్బులు చెల్లించి తమ పశువులకు వైద్యం చేయించుకోవాల్సి వస్తుందన్నారు. దీంతో పాడి రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పశువులకు సక్రమంగా వైద్యం అందించని వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై వెటర్నరీ డాక్టర్ చంద్రబాబును వివరణ కోరగా తాను ప్రస్తుతం సెలవులో ఉన్నానని తెలిపారు. పాడి రైతుల పశువులకు వైద్యం అన్ని వేళలా అందుబాటులో ఉండి అందిస్తున్నామన్నారు.



మృతి చెందిన ఆవు దూడను చూపుతున్న రైతు మధుబాబు

భక్తాంజనేయ స్వామికి విశేష పూజలు



వీరవాసరం: మండలంలోని నందమూరి గరువులో రామ భక్తాంజనేయ స్వామి వారి 59వ వార్షిక మహోత్సవాల సందర్భంగా సోమవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, గంధసింధూరంతో, తమలపాకులతో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. బాల నాగమ్మ నాటక ప్రదర్శన, సినీ ఆర్కెస్ట్రా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మేకల వెంకట చలపతి, ముద్రగళ్ల యేసు రాజు ,కొప్పినీడి శ్రీనివాసరావు, కావలి దామోదర్ రావు, కొప్పినీడి శ్యామలరావు, అప్పారావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

పాలకోడేరు: మండలంలోని శృంగవృక్షం గ్రామ పంచాయతీ వద్ద సోమవారం సర్పంచ్ జంగం సూరిబాబు అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సుమారు 70 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సూరిబాబు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలన్నారు. అలాగే బంటుమిల్లి శివారు బండి దారి పుంతలో ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న 14 కుటుంబాలకు పట్టాలు మంజూరు చేయాలని సర్పంచ్ అధికారులను కోరారు. సర్పంచ్ పట్టాల గురించి కోరిన వెంటనే ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దార్ రఘు, రీసర్వే డీటీ సూర్యనారాయణరాజు, ఆర్ఐ రాఘవమూర్తి రాజు ఆ ప్రాంత గృహాలను పరిశీలించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనివాస్, వీఆర్వోలు ప్రసాద్, దేవ సహాయం, ఎంపీటీసీ సత్యకృష్ణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు నడింపల్లి రామకృష్ణంరాజు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



బండి దారి పుంత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్లు రఘు, తదితరులు

కాళ్లలో మండలంలో 12 అర్జీలు

కాళ్ల: రెవెన్యూ సంబధిత సమస్యలతో పాటు అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందజేసేందుకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జి.సుందర్ సింగ్ అన్నారు. కాళ్ల మండలం దొడ్డనపూడి, కాళ్లకూరు గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుకు ముందు గ్రామంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సదస్సుల్లో బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. నిర్ణీత సమయంలో దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. రెండు గ్రామాల్లో 12 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ప్రవీణ్ వర్మ, ఆర్ఐ లక్ష్మీకిరణ్, వీఆర్వోలు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

భీమవరం: డిజైన్ థింకింగ్ పరిశోధనా ప్రాజెక్టుల్లో నూతన ఆవిష్కరణలకు దోహదపడుతుందని సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్ హర్షికేష్ పాటిల్ పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఏఐసిటిఈ ఐడియా ల్యాబ్, సీఎస్ఐటీ, సీఎస్‌డీ, టెక్నాలజీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఐదు రోజులు పాటు డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ పై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సోమవారం జరిగిన ప్రారంభ కార్యక్రమానికి టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎస్ గోపాలకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హర్షికేష్ పాటిల్ మాట్లాడుతూ విద్యాబోధనలో కూడా కొత్త ఆలోచనలు సృజనాత్మకతను ప్రేరేపించేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. శిక్షణా కార్యక్రమాన్ని అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళి కృష్ణంరాజు, ప్రసాద్ రాజు, ఎన్ గోపాలకృష్ణమూర్తి, ఎం సురేష్ బాబ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్‌కేఆర్‌లో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో హర్షికేష్ పాటిల్

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

ఉండి: ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా శాఖ ఎన్నికల అధికారి పువ్వుల అంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో పీఆర్‌టీయూ జిల్లా నూతన కమిటీ ఎన్నిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ వేతన సవరణ సంఘాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు సంక్రాంతి నాటికి విడుదల చేయాలని కోరారు. పీఎఫ్ లోన్ బాకాయిలు విడుదల చేయాలని వీటితో పాటు ఏపీజీఎల్ఐ బకాయిలు చెల్లించాలని కోరారు.

పీఆర్‌టీయూ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

పీఆర్‌టీయూ జిల్లా నూతన అధ్యక్షుడు ముక్కు వెంకట సత్యనారాయణ (ఎన్నార్పీ అగ్రహారం) ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు (చినకాపవరం), గౌరవాధ్యక్షుడు పీఏ రవికిరణ్ (యనమదుర్రు), మొదటి అసోసియేట్ అధ్యక్షుడు సీహెచ్ఎల్ వీఎస్ చలం(గొరగనమూడి), రాష్ట్ర కౌన్సిలర్లు దాసరి సునీల్‌కుమార్ (ఉండి), టెక్కలి గణపతి(అత్తిలి) ఎంపికయ్యారు.



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా నూతన అధ్యక్షుడు ఎంవీ సత్యనారాయణ

శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీని నిర్మించాలి

భీమవరం అర్బన్: ఎస్సీ శ్మశాన వాటిక ఆక్రమణకు గురికాకుండా దాని చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని ఎస్సీ శ్మశాన వాటిక పరిరక్షణ కమిటీ నాయకులు ఇంజేటి ప్రభాకర్ రావు, నేతల దేవదానం, ఇంజేటి శ్రీనివాస్, ఇంజేటి చిట్టిబాబు కోరారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో ఎస్సీ శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ నిర్మించాలని కార్యదర్శి శ్రీనివాసరాజుకు ఎస్సీ స్మశాన వాటిక పరిరక్షణ కమిటీ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు పేటలకు ఒకే శ్మశాన వాటిక ఉందని దానిని కొంతమంది భూస్వాములు ఆక్రమిస్తున్నారని ఆ స్మశాన వాటికకు ప్రహరీ గోడ నిర్మించి రక్షణ కల్పించాలని కోరారు. ఇటీవల జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హరిజనులు తదితరులు ఉన్నారు.



వెంపలో సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ శ్మశాన పరిరక్షణ కమిటీ నాయకులు

మెటీరియల్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం అర్బన్: ఉపాధ్యాయులు అందించిన మోడల్ పేపర్స్, మెటీరియల్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రేపాక వెంకన్నబాబు అన్నారు. భీమవరం మండలంలోని అనాకోడేరులోని డీఎన్నార్ హైస్కూల్లో గణిత ఉపాధ్యాయుడు కె. రాజేష్ కుమార్ సహకారంతో యూటీఎఫ్ వారి ఎస్ఎస్‌సి మోడల్ పేపర్స్‌ను సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ రేపాక వెంకన్నబాబు మాట్లాడుతూ ఎస్ఎస్ఎస్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడంతో పాటు నూరుకు నూరు శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ సుంకర పరమేశ్వరరావు, ఉపాధ్యాయులు వీఎమ్ నిర్మలా కుమారి, జి. నర్మద, ఎన్‌డీవీ ప్రసాద్, ఎమ్‌వీ శ్రీలక్ష్మి, డి. అనురాధ, జీఎస్ విజయలక్ష్మి, సీహెచ్ శ్రీనివాస్, ఎస్ ప్రేమ్‌రాజు, డి కనకరత్నం, జలాబాయి, ఎం బాల, పల్లలరాజు, విద్యార్థులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.



అనాకోడేరులో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ పుస్తకాలు అందజేసిన దృశ్యం

విద్యా దాత మూర్తిరాజుకు ఘన నివాళి

ఆకివీడు: పల్లె ప్రజల్లో విద్యా బుద్ధులు పెంపొందించి, మట్టిలో మాణిక్యాలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు గాంధేయ వాది, స్వతంత్ర సమరయోధుడు స్వర్గీయ చింతలపాటి వర ప్రసాద మూర్తిరాజు కృషి చేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత అన్నారు. సోమవారం కళాశాలలో మూర్తిరాజు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుజాత మాట్లాడుతూ 50 ఏళ్ల క్రితమే ఉభయగోదావరి జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతంలో విద్యాలయాలను ఏర్పాటు చేసి పల్లె ప్రజలకు విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. వచ్చే ఏడాది జనవరి 12వ తేదీన గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల 50 వసంతాలను పూర్తి చేసుకొని స్వర్ణోత్సవం జరుపుకునేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత చెప్పారు. పూర్వపు విద్యార్థి సంఘ అధ్యక్షుడు గొంటా కృష్ణమూర్తి, పూర్వపు ప్రిన్సిపాల్ విరజానంద్, పిన్నమరాజు గోపాలకృష్ణంరాజు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మూర్తి రాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ కె.సుజాత

పార్కుల సుందరీకరణకు ప్రత్యేక చర్యలు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని పార్కుల సుందరీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం భీమవరం పట్టణంలోని వంశీకృష్ణ పార్క్, ఆదర్శనగర్, నరసయ్య అగ్రహారం ఏ ఆర్ కె ఏ స్కూల్ వద్ద, హౌసింగ్ బోర్డులో ఉన్న మూడు పార్కులను, అంబేద్కర్ జంక్షన్ వద్ద ఆహ్లాదకరంగా సుందరీకరణ పనులు చేపట్టులకు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, విశాఖపట్నం నుంచి వచ్చిన ఆర్క్ టెక్చర్ తులసి రామ్, మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భీమవరం పట్టణ సుందరీ కరణలో భాగంగా పార్కులను ఆహ్లాదకరంగా అభివృద్ధి చేయుటకు ఏ విధమైన చర్యలు తీసుకుంటే బాగుంటుంది అని విశాఖపట్నం నుంచి వచ్చిన ఆర్క్ టెక్చర్ తులసి రామ్‌తో చర్చించడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రామచంద్రా రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ త్రినాథ్ రావు, హౌసింగ్ బోర్డ్ అసోసియేషన్ అధ్యక్షుడు సరి పిడకల రామారావు, కార్యదర్శి జ్ఞానపాటి మధుసూదన రావు, తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో పార్కులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

సమస్యలను పరిష్కరిస్తా

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహించవద్దని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వృద్ధుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆటోలో ఉన్న వృద్ధులతో, అనారోగ్యంతో భాధపడుతూ వచ్చిన మహిళతో ఆయన మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వారి సమస్యలను పరిష్కరించడంలో భాగంగా కొన్ని అక్కడక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. మరికొన్ని సమస్యలను నోట్ చేసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జేసి నేరుగా ఇలా ఆటోలు వద్దకు వెళ్లీ సమస్యలు తెలుసుకున్న తీరు అక్కడ వారిని ఆశ్చర్యానికి గురిచేసింది.

జనవరిలో సీపీఎం జిల్లా మహాసభలు

భీమవరం: జనవరి 3,4,5వ తేదీలలో సీపీఎం జిల్లా మహాసభలు భీమవరం పట్టణంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మహాసభ లోగోను జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జే. ఎన్.వి. గోపాలన్, బి.వాసుదేవరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ సీపీఎం పార్టీ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గ్రామ స్థాయి నుంచి అఖిల భారత స్థాయి వరకు మహాసభలు జరుగుతాయని తెలిపారు. ఈ మూడు సంవత్సరాలు కాలంలో ప్రజా సమస్యలపై చేసిన కృషిని సమీక్షించుకొని భవిష్యత్ కాలంలో ప్రజా పోరాటాలకు సిద్ధమయ్యేలా ఈ మహాసభలు జరుగుతాయన్నారు. అందులో భాగంగా 2025 ఫిబ్రవరి 2,3,4 వ తేదీలలో రాష్ట్ర మహాసభలు నెల్లూరులో, ఏప్రియల్ మొదటి వారంలో అఖిలభారత మహాసభలు తమిళనాడు రాష్ట్రంలో మదురైలో జరుగుతాయని తెలిపారు.



సీపీఎం జిల్లా మహాసభల లోగో ఆవిష్కరిస్తున్న దృశ్యం

ముగిసిన జిల్లా యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ

భీమవరం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా స్వర్ణోత్సవ మహాసభ రెండవ రోజు డిసెంబర్ 15వ తేదీ భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ముగిసింది.ఈ సభలో నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి గోపి మూర్తి హాజరయ్యారు. ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ జ్యోతి బసు వ్యవహరించారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా సీహెచ్ పట్టాభి రామయ్య, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పీఎస్ విజయరామరాజు, ప్రధాన కార్యదర్శిగా ఏకేవీ రామభద్రం ఎన్నికయ్యారు. సహాధ్యక్షుడుగా కే రాజశేఖర్, మహిళా సహాధ్యక్షురాలిగా సీహెచ్ నాగ శిరోమణి, కోశాధికారిగా పోలిశెట్టి క్రాంతి కుమార్, జిల్లా కార్యదర్శులుగా సర్వ శ్రీ, పి శివప్రసాద్, ఎస్ రత్నరాజు, టి జే విజయ్ కుమార్, జి లక్ష్మినారాయణ, కె ఎస్ సి హెచ్ సాయిరాం, జి రామకృష్ణంరాజు, కే శ్రీ రామకృష్ణ ప్రసాద్, ఎం శ్రీనిబాబు, డి ఏసుబాబు, సిహెచ్ కుమార్ బాబ్జి, పి కృష్ణకుమారి, దండు పద్మావతి, కొల్లాటి బ్రహ్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు జిల్లా ఆడిట్ కమిటీ, రాష్ట్ర మహాసభ ప్రతినిధులను ఎన్నుకున్నారు.



నూతనంగా ఎన్నికైన యూటీఎఫ్ జిల్లా కార్యవర్గం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నరసాపురం: పట్టణంలోని లాకుల వద్ద 216 జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. దీనికి సంబంధించి టౌన్ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకొల్లు వైపు వెళుతున్న కారు, ఏనుగువానిలంక వెళుతున్న ఆటోను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఏనుగువానిలంక గ్రామానికి చెందిన పెదపాటి లక్ష్మీకుమారి, పాలపర్తి భాస్కరరావు గాయపడటంతో నరసాపురం ఏరియా ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై వివరించారు.

క్లుప్తంగా

బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



బాబా ఆలయంలో గోపూజ చేస్తున్న చైర్ పర్సన్

కాళ్ల: ధనుర్మాస ప్రారంభం సందర్భంగా సోమవారం మండలంలోని పలు ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. సీసలి గ్రామంలో వేంచేసియున్న శిరిడి సాయిబాబా ఆలయంలో బాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. అభిషేక పాత్రతో సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్ పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతీదేవి భక్తులతో కలిసి ఆలయ ప్రాంగణంలో గోపూజ, అశ్వ పూజలు నిర్వహించారు. నెల రోజుల పాటు ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా బాబా వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

మేజిక్ బోస్‌కు అభినందనలు

భీమవరం: మేజిక్ రంగంలో 53 ఏళ్లుగా బోస్ చేస్తున్న విశేష కృషికి గుర్తింపుగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ రికార్డుతో కూడిన సర్టిఫికేట్‌ను ప్రదానం చేసిన సందర్భంగా సోమవారం భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) సత్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంజిబాబు మాట్లాడుతూ మేజిక్ రంగానికి సంబంధించిన సాహితీ రంగంలో బోస్ పలు పత్రికల్లో వ్యాసాలు రాయడం అభినందనీయమన్నారు. బోస్ రచించిన మేజిక్ పుస్తకాలలో «మేజిక్ గైడ్»ను అత్యుత్తమ గ్రంథంగా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ప్రకటించి అవార్డు అందజేయడం అభినందనీయమన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక చినరంగనిపాలెం ప్రాంతంలో మరణించిన వ్యక్తిని అనాథగా గుర్తించిన పోలీసులు కోరిన మీదట అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించామని సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహన్ వర్మ (పూనారామం), చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కో–చైర్మన్ కార్మూరి నరసింహమూర్తి (బాబు), కోశాధికారి గ్రంధి కుమార వెంకటేశ్వర ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ అల్లు శ్రీనివాస్, కానిస్టేబుల్ దశరథ రాము పాల్గొన్నారు.

దాళ్వాకు నారుమడులు సిద్ధం



దాళ్వాకు సిద్ధం చేసిన నారుమడులు

ఆకివీడు: దాళ్వా సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో ఖరీఫ్ మాసూళ్లు పూర్తి కాలేదు. అయితే భారీ వర్షాలు, వరదలకు మండలంలో 2,500 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. మరో 500 ఎకరాల్లో పంట పాక్షికంగా దెబ్బ తిన్నది. ముంపు నీరు బయటకు పోవడంతో వరి చేలల్లో తూడు, గుర్రపు డెక్క, కర్ర నాచు, తామర మొక్కలు, ఇతర గడ్డిజాతి మొక్కలు తీవ్రంగా మొలిచాయి. దీంతో రైతులు మడులుగా తయారు చేసి వాటిని తొలగించి నారుమడులు వేశారు. కొన్ని గ్రామాల్లో వెదజల్లే పద్ధతిలో సాగు చేపట్టారు.

ప్రతి ఒక్కరూ ధ్యానమార్గాన్ని అనుసరించాలి



ధ్యాన గురువులను సత్కరిస్తున్న దృశ్యం

వీరవాసరం: సమాజంలోని ప్రతి ఒక్కరూ ధ్యాన మార్గాన్ని అనుసరించాలని మండల పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ అధ్యక్షుడు కేవిడి ప్రసాద్ తెలిపారు.మండలంలోని రాయకుదురులో ఓంకారేశ్వర పిరమిడ్ తృతీయ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని సోమవారం ఆయన మాట్లాడారు. ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత, క్రమశిక్షణ, పట్టుదల పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో ధ్యాన యోగ్లు పిప్పళ్ళ ప్రసాదరావు, ఓంకార్ ఈశ్వర్, పిరమిడ్ నిర్మాత పోలిశెట్టి బాబి, మాజీ జెడ్పీటీసీ పోలిశెట్టి సత్యనారాయణ, అందే శివశంకర్, ధూళిపాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు ఏడు ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ఏడు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని సోమవారం చెప్పారు. స్థానిక 18వ వార్డులో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని ఇమ్మంది దుర్గా ప్రసాద్ ఫిర్యాదు చేశారన్నారు. కాకర్ల వారి వీధిలో కారం మిల్లు నడుపుతున్నందున తీవ్ర ఇబ్బందిగా ఉందని, దానిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పులవర్తి దండు గణపతి ఫిర్యాదు. సాలిపేటలోని పెద్ద వీధిలో ఆక్రమణలను తొలగించాలని గత ఆగస్టు నుంచి ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని శలా కోటనాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని శలా ఫణికుమార్ ఫిర్యాదు చేశారు. తాళ్లకోడులో ఇంటి స్థలం ఇచ్చారని, ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థిక స్తోమత లేనందున ఇల్లు నిర్మించి ఇవ్వాలని పుప్పాల నాగమణి విజ్ఞప్తి చేశారు. స్థానిక షాదీఖానా వెనుక సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి తొమ్మిది నెలలు కావస్తున్నా పనులు మొదలు పెట్టలేదని ఎండీ అలీ ఫిర్యాదు చేశారని ఎంపీడీఓ చెప్పారు. మండలంలోని సిద్ధాపురం గ్రామంలో బొడ్డుచర్ల వెంకన్న వీధిలోని రోడ్డు గడ్డిమేట్లతో ఆక్రమణలకు గురైందని, వాటిని తొలగించి దారి మార్గం ఏర్పాటు చేయాలని దీవెనమ్మ విజ్ఞప్తి చేశారని ఎంపీడీఓ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా పోలీస్‌కు గాయాలు

పాలకోడేరు: ట్రాక్టర్‌ను తప్పించబోయి ఎదురుగా వస్తున్న ట్యాక్సీ వల్ల మహిళా కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయిన సంఘటన ఇది. మోగల్లు సచివాలయంలో పని చేస్తున్న మహిళా పోలీస్ కృష్ణవేణి సోమవారం ఉదయం మోగల్లు నుంచి పాలకోడేరు వస్తుండగా ట్రాక్టర్‌ను తప్పించబోయింది. అదే సమయంలో ఎదురుగా ట్యాక్సీ రావడంతో కింద పడిపోయింది. ఈ సంఘటనలో మహిళా కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే భీమవరం ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. తమకు ఆసుపత్రి నుంచి వచ్చిన రిపోర్ట్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పాలకోడేరు పోలీసులు తెలిపారు.

వైష్ణవాలయాల్లో ధనుర్మాసోత్సవాలు



అభిషేకాలు చేస్తున్న అర్చకులు

ఆకివీడు: వైష్ణవాలయాల్లో ధనుర్మాసోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక మాదివాడలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ, వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి వార్లను ప్రత్యేకంగా అలకంరించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు తిరుప్పావై మొదటి పాసురం గానం చేశారు. తిరుప్పావై ముఖ్య ఉద్దేశాన్ని మహిళా సంఘ ప్రతి నిధులు తెలియజేశారు. భూదేవి అవతారమే గోదాదేవి. గోదాదేవి 30 పాసురాలు రచించి, గానం చేసి విష్ణు కృపకు పాత్రురాలై శ్రీరంగనాథుడిలో ఐక్యమైందని చెప్పారు. స్థానిక మాదివాడలోని భ్రమరాంబిక సమేత మల్లేశ్వరస్వామికి మార్గశిరమాసంలో ఆరుద్ర నక్షత్రంలో మహా శివుడికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అభిషేకాలను తిలకించేందుకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.